# సుడి

— మల్లిక్

"వూ బావూ శెట్టి నెగమంతన్నాడు" చిన్న గోచీ తప్ప ఏమీ లేని పదేళ్ళ గుంటడు. తట్టి లేపడంతో శెట్టి హోటల్లో ఎగుడు దిగుడు కొయ్యలమీద బిగించిన వంకరటింకర బల్లలమీద నిద్రచాలించి లేచి కూచున్నాం. నేనూ అతనూను, సాయంకాలం మేం ఎక్కాల్సిన బస్సు రోజూలాగే దారిలో చెడిపోయి కేన్సిలయిపోయే సరికి వెన్నెల రాత్రి గదాఅ మూడుకోసులూ అడ్డదార్న నడిచేద్దామా అనుకొంటే "దార్లో గొడ్లు (1) తిరుగుతున్నాయి ఎల్లొద్దు బావూ" అని అక్కడి వాళ్ళు ఆపేశారు. ఆ రాత్రికి శెట్టి పాక హోటలే ఆశ్రయమైంది. నేను లేచి శెట్టినడిగి బరిణీపుల్లందుకున్నాను. చిన్నబండి(2)లో పరిచయమై నాతో మావూరు రావడానికి ఉత్సాహపడ్డ ఆ స్టూడెంటు కుర్రాడు బ్రష్షుతీశాడు. ఆ కుర్రాడి టెర్లిన్ బట్టల్నీ. ఎయిర్ బేగ్ నీ, బ్రష్షుతో తోముకోడాన్నీ వింతగా చూస్తున్నారు అక్కడ చేరిన జనం.

చిన్న బండిలో పరిచయమైనపుడే ఆ కుర్రాడు ఈ ప్రాంతాలకి కొత్తని నాకు తెల్సిపోయింది. మాటల్నిబట్టి బాగా పడమటి వాడని అర్థమయింది. సెలవుల్లో ఈ ప్రాంతం చూడాలని వొచ్చేశాన్నాడు తప్ప

---

1. ఎలుగ్గొడ్లు
2. నేరో గేజ్‌లో నడిచే బండి దాన్ని పోతుల బండి అని కూడా అంటారు.

మరేమీ పొక్కడంలేదు. సరెగదా మా పూర్రమ్మన్నా ఊరి పేరు అవీ అడిగి తెల్సుకుని సంతోషంగా ఒప్పుకున్నాడు.

శెట్టిచ్చిన ఇడ్లీ పెసరెట్టూ పళ్ళక్రింద రాళ్ళు పటపట లాడించు కుంటూ తిని కాఫీ తాగేంతలో — గోతుల్లో బురదలో దాన్సాడుతూ ఇద.తో పిటపిట లాడిపోతూ రానే వచ్చింది బస్సు.

పదిమందితోబాటు నేనూ అతనూకూడా తోసుకుంటూ ఎలాగో ఎక్కే సాం. చివరి ఊరుదాకా ఎక్కేవారే తప్ప దిగేవాళ్ళు ఆ బస్సులో చాలా తక్కువ.

ఇక కండక్టరూ క్లీనరూ, కేకలేస్తూ తిడుతూ మొత్తంమీద అంద రినీ సర్దెయ్యడం బాగా చేతనయిన వాళ్లు—

"సుప్పులు సుప్పులెయ్" "జిలాబీ జిలాబిలయ్" అంటూ రకరకాల గొంతుకల్తో కేకలేస్తూ—

జర్మను సిలవరి పళ్ళాల్ని పట్టుకుని శెట్టి హోటల్లోంచి గోచీలు పెట్టుకున్న కుర్రాళ్ళు పరిగెత్తుకొచ్చిబస్సుచుట్టూ తిరుగుతున్నారు.

సరదాకి అక్కడచేరిన జనం తిట్టుకుంటూ తొయ్యగా దడ్డడ లాడుతూ బయల్దేరింది బస్సు.

* * *

" ఏం బావూ పంజరిగిపోనాదా నీ కోసమే సూత్తన్నా రేత్తిరికే వచ్చేత్తవనుకున్నన్నీను బేగి పద ఏటవుతోందో ఏటో—ఈ బాబో వుళు?" అంటూ బస్సుదిగ్గానే ఎదురై పలకరించేడు నాగులు గావంచా పాగా చుట్టుకుంటూ సిమ్మాద్రి-

---

* సుప్పులంటే—తినే చకిలాలాలు.

పొలం గట్లమీంచి మా వూరికేసి నడక ప్రారంభించాం ముగ్గురమూ—ఆ వాతావరణాన్నంతటినీ ఆ కుర్రాడు సంతోషంగా చూస్తున్నాడు. చుట్టూ పెద్ద కొండలు—దారిపక్కన మధ్యలో చిన్న చిన్న గుట్టలు ప్రక్కన బురదనీటి చెరువులు అన్నీ చూస్తున్నాడు కొండల్ని చూపించి పేర్లడిగి తెలుసుకుంటున్నాడు. 'మనూరు కవుల్లేంటి' అడిగేను సిమ్మాద్రిని.

"కల్లాపిసుకు నువ్వెళ్లిన పొద్దే నీనూ మా వూరి కెళిపోచ్చేసినాను గదా —నిన్నటికేటి జరగనేదు. మరియా లేటాద్దో తెల్దు. మీవూర్నాయుడు నాలుగూళ్ళ. నాయళ్ళకీ కవుల్లెట్టిందంట. ఆ చంగద్దెల్బి నీనూ రేత్తిరే మనోళ్ళందరికీ కవుల్లెట్టినా - ఏటవతలూళ్ళోళ్లు మనోళ్ళు ఈ పాటికె ఎలిపొచ్చియ్యాల ఏరేమో బాగా వత్తందనుకుంతన్నారు రేత్తిరి".... వివరాలు చెప్పుకుపోతున్నాడు సిమ్మాద్రి.

మధ్యలో చిన్న పల్లె తగిలింది అక్కడో పదిమంది కర్రలు పట్టుకుని ఉన్నారు.

"బావు మీరెల్లండి మావోల్లింకా రావాల్న మాం ఎనకొత్తాం అన్నారు వాళ్ళు ఆ కుర్రాడు ఇవన్నీ ఆసక్తిగా గమనించడం నేను చూస్తూనే ఉన్నాను.

చిన్న బండిలో మాటల్సందర్భంలో ఆ కుర్రాణి గురించి కొంత అర్థమైంది అతనేవో పాటలూ కథలూ రాస్తాడని చూచాయగా బోధపడింది. నేను పోలీసు రిపోర్టు కలెక్టరుకి మెమొరాండం ఇవ్వడానికి పట్నం వెళ్ళి తిరిగొస్తున్నానని చెప్పినప్పుడు కొంచెం హేళనగా చూసేడు. మా వూళ్ళోకూలోళ్ళు కూలి పెంచమంటే బుగతలు తన్నబోయేరని సమ్మె ప్రారంభిస్తున్నామని చెప్పితే ఈసడింపుగా చూశాడు. అయినా మా ఊరికి రావడానికి సిద్ధపడ్డాడు. అయితే ఎందుకొస్తున్నాడో మాత్రం బోధపళ్ళేదు మేం ఇంతలో పెద్దూరు చేరుకున్నాం.

అక్కడ నాయుడు, పెద్ద బుగత, శెట్టివాళ్ళ కుటుంబాలు కలిమున్నోళ్ళు బాగా ఉన్నారు. కొత్తగా నాలుగయిదు డాబాలు లేచాయి. పెంకుటిళ్ళు మాత్రం కప్పులమీద పిచ్చి మొక్కలొత్తో ఎప్పట్లాగే ఉన్నాయి. మిగతావన్నీ పదేళ్ళకితం కప్పిన గుడిసెలే అవన్నీ ఎప్పుడూ అలాగే ఉంటాయి.

"ఈ ఊరి పేరేంటి" ఆ కుర్రాడడిగేడు. నేను చెప్పేను. ఈ ఊరంతా మామూలుగానే ఉండటంతో అతనాశ్చర్యపోయినట్టు ఆశాభంగం చెందినట్టు నేను గమనించేను. ఫలానా ఇల్లేది అనడిగేడు అప్పైనుండని చెప్పి దాన్లో వెడుతూ చూపించేను. ఆ ఇల్లు కళ కళలాడుతూ మామూలుగా ఉండటంతో మరింత అశ్చర్యపోయాడు. "మరి ఈ ఇంటి భూస్వామిని...." ఆ కుర్రాడి మాట పూర్తి చేయకుండానే నేను ప్రారంభించేను. "అవును వాళ్ళు ఆడి తల చేతులు, కాళ్ళు నరికి ఇంట్లో చంపేరు. తల్ని ఉల్లో పెట్టి అరుగుపైన చూపుకి వేల్లాదేశారు. ఇంట్లో ఉన్న డబ్బేదో కొంత పట్టుకెళ్ళారు. అ కేసుమీద ఇవాల్టికీ విచారణ లేకుండా రెండొందలమంది ఎక్కడెక్కడో జైళ్ళలో ఉన్నారు—ఈ బుగత కొడుకులు, తమ్ముళ్ళు ఆ ఆస్తిని మామూలుగానే అనుభవిస్తున్నారు. మళ్లా వడ్డీలకి డబ్బులిస్తూనే ఉన్నారు—నేనూ...." అంటూ ఏదో చెప్పబోయి ఎందుకులే అని ఊరుకున్నాను.

"అంతేనా?" అతనాశ్చర్యపోయాడు. "మరింకేటి సెప్పమంతవు అంతకన్నేను" – అన్నాడు ఇదంతా వింటున్న సిమ్మాద్రి.

మేమా ఊరి పొలిమేరలు దాటి పెద్దేరు ఒడ్డుకి చేరుకున్నాం. ఒడ్డంటే ఒక్క కోసు నడిచేస్తె మా వూరొస్తుంది.

'సూసినావ బావూ ఏరు బాగా వస్తావుంది–' అన్నాడు సిమ్మాద్రి - పెద్దేరు, ఆ యేరంటే ఆ ప్రాంతాలవాళ్ళకి ఒక గౌరవం మాత్రం వుంది. వాళ్ళకి తాగేందుకు, పొలాలకి నీళ్ళివ్వడమే కాకుండా ఆ యేరు చాలా సౌమ్య

మైనదని వాళ్ళ భావన. అది దొంగేరు కాదు. వరదొచ్చే మాటుంటే మూ౹డో జులు ముందునుండే ఆ చిహ్నాలు చూపిస్తుంది. నీటి రంగు మారడం, కెరటం రావడం, ఆ తర్వాత వేగం పెరగడం, కలప కొట్టుకు రావడం అలా చిహ్నాలు చూపిస్తుంది. ఎంత ఎత్తున వరదొచ్చేదీ, ఎంత వరకు మునిగిపోయేదీ అవి చూసి ఆ ప్రాంతంవాళ్లు చెప్పగలరు. దొంగే ర్లయితే ఏట్లో దిగి దాటేలోగానే ఉపద్రవంగా ఏరొచ్చి ముంచేస్తాయి.

పెద్దేరు - ప్రతేడూ ఏతాంమీద, చెరువులమీద బతికే చుట్టుపక్కల పంటలన్నిట్నీ మిగలకుండా తుడ్చుకెడుతుంది. నాలుగైదేళ్ళ కోమారు ఊళ్ళకి ఊళ్ళనే ముంచుకుంది. అక్కడ ఆనకట్టలు అవీ కట్టొచ్చునని చెప్తే పాతికేళ్ళ అనుభవంతో అక్కడి ప్రజలు నవ్వుతారు. పెద్దేరు ప్రత్యేకత మరొకటుంది. ఎక్కడైనా సుడి పెట్టిందంటే చాలాకాలం పాటు మారదు దొంగసుడులుండవు. అలాగే రేవుకూడా ఒకటి చూసు కుంటే పడవైనా, ఈతైనా, తక్కువ నీళ్లున్నపుడు నడిచెళ్ళినా ఆ మార్గంలో ప్రమాదముండదు. కానీ సుడిలోమాత్రం గజీతగాడైనా బయటపళ్ళేడు.

ఆ ఊసూ, యీ ఊసూ చెప్పుకుంటూ నడుస్తున్నాం. ఏటొడ్డుకు చేరిన, కొండ చుట్టు గ్రామాలు, పల్లెల జనం ఓ వందమంది మా వెనగ్గా నడుస్తున్నారు- బొల్లికొండ ప్రక్కగా వెడుతున్నాం. అ కొండ ప్రక్కగా అరమైలెడితే అటుపక్క మా ఊరే. కొండపాదం ఆ చివర్న రేవుంది. బాగా ఏరొస్తే అక్కడ పడవేస్తారు.

ఏటి కావతలి గట్టు స్పష్టంగానే కన్పిస్తోంది. అక్కడకూడా చిన్న కొండ వుంది. అయితే మధ్యలో వెడల్పు బాగా వుండడంతో ప్రవాహ వేగం మారదు. ఆ రెండు కొండలమధ్య ఆనకట్టబ్రిడ్జి కడతామని పాతి కేళ్ళ క్రితం ఎవరో అని, ఆ తర్వాత పదేళ్ళకి కాస్త హడావుడి చేసి

మళ్ళీ ఈనాటిదాకా ఆ ఊసే ఎవరూ ఎత్తలేదు. అందికే ఆనక్షట్టంటే అక్కడివాళ్లు నవ్వుతారు.

మేం రేవుపైపుకి నడుస్తున్నాం — ఆ కుర్రాడు నా దగ్గరకొచ్చి రహస్యంగా బొల్లికొండకేసి చూపించి "ఈ కొండల మీద ఎవరేనా ఉన్నారా?" అనడిగేడు. "ఈ కొండ కటువేపు పెద్దకొండమీద కోయూళ్ళున్నాయి. ఆ వెనక కొండలన్నిటిమీద పోళ్ళు పెట్టుకొని పండించుకుంటారు, వెనక అడవుల్లో చింతపండు, కుంకుళ్ళు తెచ్చుకొంటారు కొండ క్రింది గ్రామాలవాళ్ళ పెయ్యల్ని తీసికెళ్ళి కాసి పెద్దయాక అప్పగిస్తారు. ఊళ్ళల్లోవాళ్లు యింటికింత అని కొలుస్తారు" అని చెప్పేను, గంభీరంగా. ఆ కుర్రాడు "అదికాదండీ ... కొండమీద.... ఇక్కడ పోరాటం" అంటూ నెమ్మదిగా అడిగేడు. "పోరాటాలకేం? వ్యవసాయ కార్మికులు, పేద ప్రజలు పోరాటాలు జరపకుండా బ్రతగ్గలరటయ్యా బుగ్గలు బ కనిస్తారా?" అన్నాను. "అదిగాదండీ" అంటూ అతను మళ్ళి ప్రారంభించేడు. నా కతగాడి విషయంముందే అర్థమైందిగాబట్టి ఆశ్చర్యపోలేదు. కాని ఎలా చెప్పాలా అని కాస్సేపు ఆలోచించేను. సిమ్మాద్రి యింకెవరితోనో మాట్లాడుతూ నెమ్మదిగా వస్తున్నాడు. మేం ఇదరం ముందు నడుస్తున్నాం.

"నువ్వు అడిగినవాళ్లు ఇప్పుడెవరూ ఈ కొండలమీద లేరు. అంత వరకూ చెప్పగలను. వివరాలు కావాలంటే తరవాత నింపాదిగా ఊరెళ్లాక చెప్తేను. ఇంతకీ నువ్వెందుకొచ్చావో నాకు తెలీడంలేదు" అనడిగేశాను.

"ఇక్కడ లక్షలమంది పోరాడటంలేదూ" అన్నాడు ఆ కుర్రాడు ఉద్రేకంగా నన్ను అపనమ్మకంగా చూస్తూ. "లక్షలమంది పోరాడుతున్న మాట నిజమేనయ్యా బాబూ. ఏ పోరాటాలు జరుగుతున్నదీ మా పూరొస్తున్నావుగా నువ్వే చూద్దువుగాని" అన్నాను. అతను తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు ఆ మొహం చూడగానే నాకు తెలుస్తోంది. మాట్లాడకుండా నడుస్తున్నాడు,

రేవు దగ్గరికొచ్చాం. ఏటిఅవతల ఊళ్ళవాళ్ళు ఈదుకుంటూ కొందరు, పడవలో కొందరు ఆ ఒడ్డునుండి వస్తున్నారు. కొందరు గట్టెక్కేరు.

"ఏర్రా మిగతావోళ్లేరీ" సిమ్మాద్రడిగేడు. "ఆ ఎనకున్నారు. సుట్టి తిరిగి కొండకాడికెల్లడ మెందుకు. నేటయిపోద్ది. ఊరికాడికే డైరెట్టు గెల్లిపోతాం. అడనే ఏరు దాటతామని కూకున్నారు. ఎంతసెప్పినా ఇన్నే- మీరు ముసిల్నాకొడుకులు - ఎల్లండెల్లండ్రాని బూతుల్లంకించుకుంతన్నరు. సర్లేని మాం పారొచ్చేసినం" అన్నాడొకడు.

"ఓ రెవడ్రాడు. బుర్రలేనినా కొడుకులు. ఏటిపెమాదం సూసుకోకుండా సుడిలోగ్గాని గెంతిసినారేటి. ఓరి సూడండ్రోయ్, రాండ్రా రాండి" అంటూ కేకలుపెడుతూ ఊరిదగర ఏటొడ్డుకేసి ముందు పరుగు తీశాడు సిమ్మాద్రి. అందరు వెనక పరిగెడుతున్నాం. అప్పటికే ఊరి కటువేపు పెద్దగెడ్డ ఉరకలేస్తూ ఏటోకి దూకుతున్న శబ్దం వినపడుతోంది. ఏటవతలొడ్డున కొందరు వెనక్కి ఈదుకుంటూ తిరిగెళ్ళడం కనిపించింది. అమ్మయ్య సుడిని తెలుసుకొని వెనక్కెళ్లారు కదా ఫరవాలేదనుకొన్నాం "ఒరే దూకండ్రా సుడిదగ్గరకొచ్చేత్తన్నర్రో" అంటూ సిమ్మాద్రి కేకపెట్టి పైగట్టుమీంచి దూకేశాడు. గబగబా పాతికమంది గజీతగాళ్లు ప్రవహిస్తున్న ఏట్లోకి దబదబా దూకేసి మహావేగంతో ఈదుకుంటూ పోతున్నారు.

ఏటి మధ్యలో ఆ ప్రక్కన వుంది సుడి. కొద్దిమంది అటునుండి సుడివైపుకు యింకా ఈదుకుంటూ వస్తూనే వున్నారు.

"ఒరే రాకండ్రో ఎనకెల్లండెహె. ఎనక్కెల్లండ్రో సుడుందిరో" అంటూ ఈవతల ఒడ్డుమీంచి మేం కేకలు పెడుతూనే ఉన్నాం. అందరికీ ఆందోళనగా ఉంది. అయ్యో అన్యాయంగా ప్రమాదంలో కూరుకుపోతున్నారే అని. ఏరు భయంకరంగా శబ్దంచేస్తూ ప్రవహిస్తూనే ఉంది.

అంతలో సిమ్మాద్రి వాళ్ళు దాదాపు చాలా మందిని భుజాలమీదేసుకుని, కొందరి రెక్కలు పట్టుకుని జాగ్రత్తగా సుడికి దూరంగా లాక్కు

వోయి ఒంటి చేతుల్తో ఈదుకుంటూ ఈ డ్డుకు రావడం కన్పించేక అందరం కాస్త నిబ్బరపడి ఊపిరి తీసుకున్నాం. అట్నించి దూకిన కుర్రాళ్లలో కొందరు అప్పటికే నీళ్లమింగేశారు.

వాళ్ళని ఒడ్డుమీద పడుకోబెట్టి పొట్టపీపు నొక్కుతున్నారు.

"ఓ రెండుకురా అంత తొందరపాటు ఈరత్వం ఎలగబెడత మనుకున్నా రేట్రా, కూసంత రెండుగ్గుళే రేపేగదరా, ఒరే-అవుసర మైతే నవ్వడాన్కి అందరం సిద్ధమేరా—అనువుపరంగా సచ్చిపోడం ఎందకరా—ఇంత గొప్ప తెలివేడబుట్టిందిరా మీకు? ఎవుడు సెప్పాడురా మీకీ బుద్ధి అ(?" అని సిమ్మాద్రి తిడుతున్నాడు—ఒకడు ఒగుర్చుకుంటూ "అల్లరుగో—ఆల్లు మల్లీ ఎనక్కెల్లి రేవంట తిరుగొత్తున్నారు సూడూ—ఆల్లే—ఈదే దూకుదం అన్నరు—మాం దూకేసినం—నారె నుడిరో మాం రేవుకాడ కెల్తమన్నారు—మా వన్నమూ మాం దూకేసినం ఏటైనా చరే ఈదేత్తామన్నం" అంటూచెప్పేడు. "ఓరోర్నోరుముయ్యసె మాగొప్ప తెలివె!" అని సిమ్మాద్రి నవ్వేశాడు. అప్పటికి అందరూ అక్కడికి చేరు కున్నారు. అందరం ఉత్సాహంగా బయలుదేరాం—మా వూరివేపు వెదురు తోటలోంచి సాగిపోతున్నాం. ఏటిప్రవాహం ఏట్లో దూకుతున్న పెద్దగెడ్డ శబ్దం, ఏటిగాలికి వెదు ళ్ళూదుతున్న స్వరాలు అన్నీ ఒక సంగీతంలా వినిపిస్తున్నాయి.

నా ప్రక్కనే నడుస్తున్నాడు ఆ కుర్రాడు. ఏమీ మాట్లాట్టంలేదు. అతని మెదళ్ళో ఏవో ఆలోచనలు భావాలు సుళ్ళు తిరుగుతున్నట్టు గమ నించేను. అతని చెవిదగ్గరచేరి ఒక్కమాట చెప్పితే ఎలా ఉంటుందో అను కున్నాను. దగ్గరికెళ్ళాను. "పెద్దూరి బుగత హత్య కేసులో....అని ప్రారంభించేను. "నేనూ అందులో ముద్దాయినే బెయిలుమీద విడుదల అయ్యాను." అని చెప్పాలనుకొని మళ్ళీ ఎందుకో మధ్యలో ఆపేశాను. అతను ఏమిటన్నట్టు చూపేడు నేనేం మాట్లాడలేదు. ఊరు సమీపిస్తోంది.

చుట్టూ తోటలు, ఏరూ, ఊరూ కంపించి పోయేలా నినాదాలెత్తు తున్నాడు సిమ్మాద్రి. అంతా ఆ నినాదాల్లో ఒకటే గొంతుకై కల్సిపోయారు.